## కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రంను పరిశీలించిన కావలి ఆర్డీఓ



**కావలి, నవంబర్05 ప్రభాతవార్త :** కావలి ఆర్డీఓ వంశీకృష్ణ కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. రక్తకేంద్రం కన్వీనర్, వివిధ సంఘాలకు గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ రక్తకేంద్రంలో నిర్వహించే రక్తపరీక్షలు, వివిధ ఆధునిక యంత్రసామాగ్రిని ఆర్డీఓకు వివరించారు. ఎనిమిది సంవత్సరాలుగా కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం రక్తసేకరణలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో ఉందని తెలిపారు. పలు మహానగరాలలో సైతం లేనటువంటి కాంపోనెంట్‌బ్లాక్‌ను తమ రక్తకేంద్రంలో పట్టణదాతలు, జిల్లా రెడ్‌క్రాస్ సహకారంతో సమకూర్చుకున్నామని డాక్టర్ రవికుమార్ తెలిపారు. కావలి ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా రెడ్‌క్రాస్‌కు విచ్చేసిన ఆర్డీఓ వంశీకృష్ణను రెడ్‌క్రాస్ సిబ్బంది దుశ్శాలువాతో, పూలమాలతో, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కమిటి సభ్యుడు కావలి కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, రెడ్‌క్రాస్ బాధ్యులు దాకారపు రవిప్రకాష్, హరినారపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిరహిత భారతావనిని నిర్మించాలి



**కావలి, నవంబర్05 ప్రభాతవార్త :** అవినీతిరహిత భారతావనిని నిర్మించాలని సామాజికవేత్త లోక్‌అ దాలత్ సభ్యులు యం.మాలకొండారెడ్డి తెలిపారు. కావలి పట్టణ జనతాపేటలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణంలో సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ ఆదేశాల మేరకు వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళ వారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ యస్‌కె.అజిత్‌బాష అధ్యక్షత వహించారు. మాలకొండారెడ్డి మాట్లాడారు. మనదేశ ఆర్థిక,రాజకీయ,సామాజిక పురోభివృద్ధికి అవినీతి ఒక ప్రధాన అవరోధమని తెలిపారు. అవినీతిని నిర్మూలించడానికి, నియంత్రించడానికి కేంద్రస్థాయిలో సెంట్రల్ విజిలెన్స్ కమీషన్, సిబిఐలు ఉన్నాయన్నారు. రాష్ట్రస్థాయిలో ఎసిబి, లోకాయుక్త సిఐడి పనిచేస్తున్నాయన్నారు. ప్రతి పౌరుడు అవినీతిని ప్రోత్సహించకుండా బాధ్యతాయుతమైన పౌరుడుగా సమాజంలో ఎదగాలన్నారు. లంచం ఇవ్వడం, తీసుకోవడం రెండూ కూడా నేరమేనన్నారు. బ్యాంక్ మేనేజర్ అజిత్‌బాష మాట్లాడుతూ మహాత్మాగాంధి కలలుగన్న అవినీతిరహిత సమాజ నిర్మాణానికి పౌరసంస్థలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు నిరంతరం కృషి చేయాలన్నారు. ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ క్రెడిట్ ఆఫీసర్ ప్రేమవర్మ, అడ్మిన్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

## జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సమావేశం



**ఇందుకూరుపేట, నవంబర్ 5, ప్రభాతవార్త :** జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో ఆశా డే సమావేశం నిర్వహించడం జరిగింది. ప్రధానమంత్రి మాతృ వందన యోజన కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నుండి గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న ఆర్థిక పారితోషికం సకాలంలో అందేటట్లు చూడాలని, ఏ ఒక్కరికి మిస్ కాకుండా చూడాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సమావేశంను ఉద్దేశించి డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ పి.షైనీ ఆశా వాలంటీర్లతో చర్చించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆరోగ్య శాఖ ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందిస్తున్న అన్ని పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకరరావు, హెల్త్ సూపర్‌వైజర్ రమా, సతీష్‌బాబు, షేక్ జావిద్, టీబీ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది, ఆశా వాలంటీర్లు పాల్గొన్నారు.

## టిడిపి సీనియర్ నేత దొడ్ల కోదండరామిరెడ్డికి పితృవియోగం



**బుచ్చి నవంబర్ 5 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని సీనియర్ టిడిపినేత,బుచ్చి సిహెచ్‌సి డైరక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి తండ్రి దొడ్ల నరసింహారెడ్డి (91) మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నరసింహారెడ్డి కళ్ళు దానం చేసినట్లు తెలిపారు.

## సక్షం న్యూట్రి గార్డెన్ ను పరిశీలించిన సిడిపిఒ సునీలత





**ఆత్మకూరు,నవంబర్5ప్రభాతవార్త:** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్షం పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా పెంచిన న్యూట్రి గార్డెన్ ను ఆత్మకూరు ప్రాజెక్ట్ అధికారిణి పగడాల సునీలత మంగళవారం పరిశీలించారు. మండలంలోని కరటంపాడు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం, మెయిన్-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు సామ్రాజ్యం, సురేఖలు పెంచిన కూరగాయల తోటలను పరిశీలించారు. అనంతరం కరటంపాడు మెయిన్ అంగన్‌వాడీకేంద్రాలో ఏర్పాటు చేసిన తల్లుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి నెల5వ తేదీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇసిసిఇ డే ప్రీస్కూల్ కార్యక్రమాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట,మాట,పాట, కథ, సృజనాత్మకత కార్యక్రమాల ద్వారా అందించే అభివృద్ధుల గురించి వివరించారు. వీటితో అంగన్‌వాడీ కేంద్రాలను కాన్వెంట్‌లకు ధీటుగా ప్రీస్కూల్ మెటీరియల్‌తో బలోపేతం చేస్తున్నా మన్నారు. ఈవిషయాల పట్ల తల్లులకు అవగాహన కలిగించారు. మొదటి, మూడవ బుధవారాల్లో కమ్యూనిటీబేస్ ఈవెంట్స్ లో భాగంగా అన్నప్రాసన, సామాజిక ఆరోగ్య కార్యక్రమాలు, కొత్తగర్భవతి నమోదు, సుపోషణ, ప్రీస్కూల్ నమోదు కార్యక్రమాలను గురించి వివరించారు. అనంతరం కేంద్ర పరిధిలో బాలింతలను సందర్శించారు. వారికి పౌష్టికాహారాన్ని బాగా తీసుకొని బిడ్డకు తల్లిపాలు అందించాలని దాంతో బిడ్డ ఆరోగ్యం బాగుంటుందని, అదేవిధంగా తల్లి ఆరోగ్యం కూడా బాగుటుందన్నారు.బిడ్డకు పాలు ఇచ్చే సమయంలో పరిశుభ్రతలను పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పాలు, గుడ్డు, సంపూర్ణ ఆహారాన్ని తీసుకొని రక్తహీనతను తగ్గించాలన్నారు. అనంతరం చిన్నారులకు టిహెచ్‌ఆర్‌ను పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఎన్.కె.నారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సామ్రాజ్యం, సురేఖ, తల్లులు, చిన్నారులు, గర్భవతులు, బాలింతలు , ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో బావినీరు సదుపాయం

విడవలూరు, నవంబర్ 5, ప్రభాతవార్త : మండలం చౌకచర్ల పంచాయితీ ఎస్సీ కాలనీ పరిధిలో ఉన్న త్రాగునీరు బోరు బావి కొన్నాళ్ల నుండి నిరుపయోగంగా మిగిలిపోయింది. ఈ సమస్యను గ్రామ ప్రజలు కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకుపోయి కాలనీలో సుమారు 200 కుటుంబాలు బావినీటితో ఆధారపడి ఉన్నాయని తెలపడంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే బావిలో ఉన్న మురికి నీరును బయటకు తొలగించి ఉపయోగంలోకి తీసుకురావాలని తెలపడంతో గ్రామ సర్పంచ్ అరగల వినోద్ కుమార్ బావినీరును తొలగింపు వేగవంతంగా చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమ్మిరెడ్డి మల్లారెడ్డి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల తనిఖీ సూపర్వైజర్ రమణి



**విడవలూరు, నవంబర్ 5, ప్రభాతవార్త :** మండలం వావిళ్ళ అంగన్వాడి సెక్టార్ సంబంధించి రామతీర్థం అంగన్వాడి 1 కేంద్రంలో సూపర్వైజర్ రమణి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కోడిగుడ్లు నాణ్యత, ప్రభుత్వం అందించే కిట్టు బ్యాగులు, పౌష్టికాహారం నిల్వ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఎత్తు బరువు పరిశీలించి అంగన్వాడి కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని తింటే పిల్లలు బలంగా ఉంటారని తెలియజేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి ప్రభుత్వం ద్వారా వచ్చే ఆహారంపై దృష్టి పెట్టాలన్నారు. పిల్లలకు పెట్టే భోజనం నాణ్యతగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కె. భారతి, ఎం. శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా చవితి వేడుకలు



**విడవలూరు, నవంబర్ 5, ప్రభాతవార్త** :మండలంలో ఎలగాలమ్మ గుంట, పెనుగొండ అమ్మ ఆలయంలో నాగుల చవితి సందర్భంగా మహిళలు ఉదయం నుండి పెద్ద ఎత్తున పుట్ట వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం కూడా మహిళలు పుట్ట వద్దకు వెళ్లి విశేష పూజలు చేసి విగ్రహాలకు పాలాభిషేకం, అభిషేకం అత్యంత వైభవంగా చేశారు. అనంతరం నాగరాజా స్వామిని దర్శించుకుని పంచామృతాలు భక్తులకు పంచిపెట్టారు.

## ప్రపంచంలో రెండవ అత్యంత సాధారణ క్యాన్సర్ "లంగ్ క్యాన్సర్"అవగాహన సదస్సులో డాక్టర్ లక్ష్మి



**కావలి, నవంబర్05 ప్రభాతవార్త :** ప్రపంచంలో రెండవవ అత్యంత సాధారణ క్యాన్సర్ లంగ్ క్యాన్సర్ అని డాక్టర్ లక్ష్మి తెలిపారు. కావలి పట్టణ జనవిజ్ఞానవేదిక, కావలి రెడ క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కావలి పట్టణ పిబిఆర్ విట్స్ కళాశాలలో లంగ్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా డాక్టర్ లక్ష్మి పాల్గొని అవగాహన కల్పించారు. క్యాన్సర్ అనేది లంగ్ క్యాన్సర్‌గా, బ్లడ్‌క్యాన్సర్‌గా, స్కిన్ క్యాన్సర్‌గా వివిధ రూపాల్లో ఉంటుందని ఆమె తెలిపారు. లంగ్‌క్యాన్సర్ గాలి కాలుష్యం, స్మోకింగ్, సెకండ్ హ్యాండ్ స్మోక్ (ధూమపానం అలవాటు లేకపోయినా ఆ అలవాటు ఉన్నవారు వదిలే పొగపీల్చడం వలన) కుటుంబ చరిత్ర, తీవ్రశ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, ప్రమాదకర వృత్తులవలన ఈ వ్యాధులు సోకుతాయని ఆమె తెలిపారు. ధూమపానం మానుకోవడం, ఇంట్లో లేదా పనిప్రదేశాల్లో పొగరహిత వాతావరణం ఏర్పాటుచేసుకోవడం, ఆరోగ్య అహారం తీసుకోవడం, క్రమంతప్పకుండా వ్యాయామం చేయడం, వాయుకాలుష్యం నుంచి దూరంగా ఉండడం, రెగ్యులర్ హెల్త్‌చెకప్ చేయించడం ద్వారా లంగ్‌క్యాన్సర్‌ను నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో విట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యన్.శేషయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవి.సుబ్బయ్య, చీఫ్ మెడికల్ ఆఫీసర్ జి.కన్యాకుమారి, పేషెంట్ కౌన్సిలర్ పి.పద్మజ, కావలి పట్టణ జనవిజ్ఞానవేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, జెవివి ఉపాధ్యక్షులు కె.హరినారపరెడ్డి, జెవివి సంయుక్త కార్యదర్శి సి.కల్లయ్య, మండల వెంకటరమణయ్య, గాదిరెడ్డి, సభ్యులు అమిరిశెట్టి హజరత్తయ్య, శ్రీకీర్తి, ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు, నవంబరు 5 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో కార్తీక మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. రుత్వికులు సుబ్బయ్య స్వామి, ఫణీంద్రస్వామి, తదితరులు ఉన్నారు.

## కొండచిలువ కలకలం



**వింజమూరు,నవంబర్5ప్రభాతవార్త:** వింజమూరు మండలం ఊటుకూరు ఎస్సీకాలనీలో కొండచిలువ సంచారంతో కలకలం సృష్టించింది. సోమవారం రాత్రి కొండచిలువ గ్రామంలోని గుడివద్ద సంచరిస్తుండడంతో ఆప్రాంత వాసులు చూసి భయపడి సమీపంలోని ఇందిరానగర్ కాలనీలోని పాములుపట్టేవారికి సమాచారం అందించడంతో వారు వచ్చి కొండచిలువను పట్టుకొని అడవిప్రాంతంలో వదిలారు. కాలనీ చుట్టూ గుబురుగా పెరిగిన చెట్లతో తరచూ నివాసాల్లోకి రక్తపింజరు, నాగుపాములు, నివాసాల పరిసరాల్లో తిరుగుతుండడంతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు కాలనీసమీపంలోని చెట్లు తొలగించి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ప్రత్యేక అలంకారంలో శివాలయం

**విడవలూరు, నవంబర్ 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఉన్న శివాలయంలో భక్తులు కార్తీక మాసం సందర్భంగా వందల సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం, వివిధ రకాల పూలలంకరణ, విద్యుత్ అలంకరణ పూజలు చేశారు. భక్తులు హరహర మహాదేవ అంటూ ఆలయం చెట్టు ప్రదక్షిణలు చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అని పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బక్తుల కోర్కెలు తీర్చేదేవుడు నాగేంద్రుడు;నాగుల చవితికి పోటెత్తిన బక్తులు



**కలిగిరి, నవంబర్05, ప్రభాతవార్త ;** విష్ణుమూర్తికినాగేంద్రుడు ఆదిశేషురూపంలో శేషపాన్పుఇచ్చినట్లే బక్తుల కోరిన కోర్కెలు తీర్చే దేవదేవుడు నాగేంద్రుడు. నాగేంద్రస్వామిపడుగను నాగుల చవితి అంటారు. నాగుల చవితి సందర్భంగా మంగళవారం ప్రజలు పండుగను అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. నాగేంద్రస్వామిని సుబ్బరాయుడుగానూ, సుబ్రమ ణ్యంస్వామిగానూ బక్తులు కొలుస్తుంటారు. సుబ్రమ ణ్యం స్వామికి ఇష్టమైనరోజు మంగళ˘వారం.అలాంటి అరుదైన రోజు నాగుల చవితి రోజు రావడంతో బక్తులు అదికంగా ఒక్కపొద్దులతో నాగుల చవితికి పూజలుచేశారు. ఒడపప్పు,మొలకవచ్చిన సొద్దలు, బెల్లము,బియ్యపు చలిపిండి, కొబ్బరికాయతో బక్తులు నాగులపుట్టకు అత్యంత బక్తిశ్రద్దలతో మొక్కులు చెల్లించారు. కొత్తగా పెళ్లైన దంపతులకు సంతానం కలుగుతుందని, పెళ్లికానివారికి నాగులచవితికి ఒక్కపొద్దులు ఉంటే త్వరగా పెళ్లిళ్లు జరుగుతాయని, మంచి ఉద్యోగాలు, కుంటుంబంలో ఉన్న కలతలు,ఇతర రుగ్మతులు ఒక్కపొద్దుఉన్నందున తొలగిపోతాయని పెద్దలు చెబుతుంటారు.ఈనమ్మకంతోనే బక్తులు సుబ్బరాయుడికి నిండు ఒక్కపొద్దు(24గంటల ఒక్కపొద్దులు) ఉంటారు. ఇలాంటి పండుగకు కొత్తజంటలు విరివిగా ఒక్కపొద్దులు ఉండిమొక్కులు తీర్చుకున్నారు.

## క్రమ పద్ధతిలో ఎరువులు వాడాలి ఏడిఏ సుజాత

**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 5, ప్రభాతవార్త :** మండలం గౌతమ్ నగర్, గండవరం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం కోవూరు ఏడిఏ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో అనుకూలమైన రకాలను వాటి యొక్క కాల పరిమితం గురించి వివరించడం జరిగింది. రైతులు క్రమం తప్పకుండా నారుమడి పరిశీలించి వరి నాటాలి ముఖ్యంగా పంటను కాపాడుకోవచ్చని తెలియజేశారు. అలాగే భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువులు వినియోగం చేయాలి తద్వారా అధిక దిగుబడులు రావడం జరుగుతుందన్నారు. అంతకుముందు నారుమడిలు పరిశీలించి రైతులకు అవగాహన కల్పించి పంట భీమా యొక్క అవశ్యకత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ శ్రీలక్ష్మి, ఏఈఓ పి. వెంకట్రావు, జెవివో పి. వెంకటేశ్వర్లు, విఏఏ కె. కావ్య, కవిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్‌పేట మండలంలో ఘనంగా నాగులచవితి వేడుకలు



**అనుమసముద్రంపేట,నవంబర్5ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలంలోని వివిధ గ్రామాల్లో నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్‌పేటలోని బస్టాండ్ సమీపంలో ఉన్న పుట్ట వద్దకు మహిళలు అధికసంఖ్యలో వెళ్ళి ఉదయం నుండి ఉపవాసాలు ఉండి పట్టు వద్దకు వెళ్ళి చుట్టూ దారం కట్టి పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు పటుట్టవద్దకు వెళ్ళి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఘనంగా కార్తీక మంగళవారం పూజలు



**కోవూరు, నవంబరు 5 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చే మంగ ళవారం సందర్భంగా ఆలయంలో స్వామి వారికి, అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బి. సురేష్, మాజీ ధర్మకర్తలు పి. మోహన్, భక్తులు ఉన్నారు.

## ప్రసన్నను అభినందించిన కోవూరు నేతలు



**కోవూరు నవంబర్ 5 ప్రభాతవార్త ;**వైసిపి రాష్ట్ర అధికారప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆయన నివాస ంలోమంగళవారం కోవూరు మండల వైసిపి ప్రచార విభాగం అధ్యక్షులు అత్తిపల్లి అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసిపూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. వైసిపి నాయకులు కలికి శ్రీదర్‌రెడ్డి, కార్తిక్‌రెడ్డి,కిషోర్‌రెడ్డిలున్నారు.

## రైతులు తెగుళ్లు గుర్తించాలి



**విడవలూరు, నవంబర్ 5, ప్రభాతవార్త :** మండలం మన్మధ రావుపేట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ముఖ్యంగా నారుమల్లు చల్లి క్రమంలో విత్తన శుద్ధి గురించి తెలుసుకోవాలి విత్తనం ద్వారా అగ్గి తెగులు, ఎండు తెగుళ్లు రావడంపై వివరించారు. రైతులు తెగుళ్లను గమనించి అవసరమయ్యే మందులు వాడినట్లయితే తెగుళ్ల నివారణ జరుగుతుంది. తద్వారా అధిక దిగబడులు కూడా రావడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏలు అరుణ తదితరులు పాల్గొన్నారు.

## పసుపులో దుంపకుళ్ళు



**సీతారామపురం నవంబర్ 5 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని చిం తోడు మరియు పెద్ద నాగంపల్లి గ్రామా లలో పొలం పిలుస్తోంది కార్యక్ర మాన్ని మండల వ్యవసాయాధికారి పి.చెన్నారెడ్డి నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతు చింతోడు గ్రామంలో సాగులో ఉన్న పసుపు పంటను పరిశీలి ంచామని పసుపులో దుంపకుళ్లు ఉన్నట్లు గుర్తించామని,దుంపవలన మొక్క మొదళ్ళలలో కుళ్ళు ఏర్పడి క్రమీణ మొక్కలు ఎండిపోతాయని తెలిపారు.నివారణకు పలు సూచనలు అందించారు.నీటి తడలు తక్కువ వ్యవధిలో ఇవ్వకూడదని తెలిపారు.పంటలో నీరు ఎక్కువగా నిలువ ఉండడం వలన దుంపకుళ్లు వ్యాప్తి అదికం అవుతుందని తెలిపారు. అనంతరం పెద్ద నాగంపల్లి గ్రామంలో సాగులో ఉన్న వరి పంటను పరిశీలించి తగు సూచనలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఇఒ సాంబశివయ్య, వెటర్నటి అసిస్టెంట్ మహేశ్వరీ, విఏఏ లక్ష్మీనారాయణ, ఏఎంసి యార్డ్ అసిస్టెంట్ చిరంజీవి రైతులు పాల్గొన్నారు.

## కనుపూరు కాలువ వద్ద ఉద్రిక్తత



**పొదలకూరు, నవంబర్ 5, ప్రభాతవార్త :** పొదలకూరు మండలంలోని ప్రగతి నగర్ వద్ద ఉన్న కనుపూరు కాలువ వద్ద మంగళవారం టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యే సోమిరెడి చంద్రమోహన్ రెడ్డి టెండర్లు పిలవకుండా కాలువ పూడికతీత పనులు చేయిస్తున్నారని ఆరోపిస్తూ మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కాలువ పూడికతీత పనులను పరిశీలించడానికి వస్తారని స్వాగతం పలికేందుకు వైసిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఈ పర్యటనను అడ్డుకునేందుకు టిడిపి కార్యకర్తలు కూడా అక్కడికి చేరుకున్నారు. నెల్లూరులో ఇంటి వద్దనే కాకాని గోవర్ధన్ రెడ్డిని హౌస్ అరెస్టు చేయడం వల్ల ఆయన రాలేదు. నెల్లూరు రూరల్ డిఎస్పి పొదలకూరు సిఐఎస్‌ఐలు సంఘటన స్థలంలో నినాదాలు చేస్తున్న ఇరు పార్టీల కార్యకర్తలను అక్కడి నుంచి పంపించేశారు. టిడిపి మండల అధ్యక్షులు తలచూరు మస్తాన్ బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలోని ఐదు సంవత్సరాలులో పడవలు పెట్టి పూడిక తీసి ఇష్టానుసారంగా దోచుకున్నారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి నారుమడులకు ముందే పూడికతీత పనులు ప్రారంభించాలని ఇందువల్ల ఎకరానికి నాలుగున్నర పుట్టి పండించవచ్చునని అందుకే పనులు చేయిస్తున్నారని అన్నారు. మీ హయాంలో టెండర్లు పిలిచారా అని అన్నారు. మిషన్లతో కనుపూరు కాలువ పూడిక తీత పనులు చేయిస్తున్నామని తెలిపారు. వైసిపి నాయకులు బచ్చల సురేష్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకొని రావడం కాదు. పోలీసులు లేకుండా టిడిపి నాయకులు వస్తే తేల్చుకుందామని తమ పార్టీ ఫ్లెక్సీలను చించి కుర్చీలను కాలువలో విసిరేశారని టిడిపి నాయకులు చేసిన ఈ అక్రమాలను గుర్తు పెట్టుకుని ఉంటామని మేము గొడవలకు దిగితే ప్రశాంతంగా ఉన్న విలువూరు గ్రామంలో లా అండ్ ఆర్డర్ ఏమవుతుందని ప్రశ్నించారు.

## ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై అవగాహన పెంచాలి



**కోవూరు, నవంబర్ 5 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు గానూ ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై గ్రామీణ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేలా గ్రామ సచివాలయ ఉద్యోగులు, విద్యుత్ సిబ్బంది దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్‌రెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఈ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ఏర్పాటు చేసుకుంటే కరెంటు బిల్లులు ఘననీయంగా తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు 1 కిలో వాట్ సోలార్ ప్యానల్ పెట్టుకుంటే అందుకు ప్రభుత్వం 30 వేలు, 2 కిలో వాట్ పెట్టుకుంటే 60 వేలు, 3 కిలో వాట్ ఆపైన పెట్టుకుంటే 78 వేలు ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుందన్నారు. ఈ సోలార్ ప్లాంట్‌ను ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వ సబ్సిడీతో పాటు విద్యుత్ బిల్లులు కూడా చాలావరకు ఆదా అయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. దీంతో పాటు పెట్టుబడిపై 25 నుంచి 30 శాతం వరకు రిటర్న్ వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గృహ వినియోగదారులు ఈ పథకంపై అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీనిపై వారికి సచివాలయ ఉద్యోగులు, విద్యుత్ సిబ్బంది మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం భారతదేశంలో గుజరాత్, కేరళ, మహారాష్ట్ర, రాజస్థాన్, చెన్నై వంటి రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. మన రాష్ట్రంలో కూడా నూతన ప్రభుత్వం ఈ ఏర్పాటుకు చొరవ చూపుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని గృహ వినియోగదారులు అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ ఈ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు దీనిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈలు రమేష్‌బాబు, మునిరాజా, గిరిధర్‌లు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, విద్యుత్ సిబ్బంది, సోలార్ వెండర్స్ ఉన్నారు.

## అనపల్లికి సతీ వియోగం



**కోవూరు, నవంబర్ 5 ప్రభాతవార్త :** కోవూరు శాంతినగర్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త , ఏసీసీ కళ్యాణ మండపం అధినేత అనపల్లి అశోక్‌రెడ్డి సతీమణి సులోచనమ్మ సోమవారం మృతి చెందారు. ఈ మేరకు కోవూరులోని అనపల్లి స్వగృహానికి మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సొసైటీ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, నేతలు వెంకటరమణారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, అనూప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## టిడిపి జీవితకాల సభ్యత్వాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా అందుకున్న పోట్లూరి



**కావలి, నవంబర్05 ప్రభాతవార్త :** తెలుగు దేశంపార్టి జీవితకాల సభ్యత్వాన్ని ఎమ్మెల్యే దగుమాటి చేతులమీదుగా టిడిపి రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు పోట్లూరి శ్రీనివాసులు తీసుకున్నారు. కావలి ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం పోట్లూరి లక్షరూపాయలు జీవిత కాల సభ్యత్వాన్ని చెల్లించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సభ్యత్వ కార్డును పోట్లూరికి అందచేశారు. ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, కావలి నియోజకవర్గ లీగల్‌సెల్ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరిలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగులచవితి



**బిట్రగుంట, నవంబర్ 5, ప్రభాతవార్త:** బోగోలు మండలంలోని బోగోలు, విశ్వనాదరావుపేట మేజర్ పంచాయతీలతోపాటు గ్రామాలలో మంగళవారంనాగులచవితి పర్వదిన వేడుకల్ని నిర్వహించుకున్నారు. ఈసందర్బంగ భక్తులు అధికసంఖ్యలో నాగుల పుట్టలవద్దకువెళ్ళి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. నాగుల పుట్టలచుట్టు మహిళల భక్తులతో కిటకిటలాడాయి. ఉపవాసదీక్షతో ఈ కార్యక్ర మాన్ని నిర్వహిం చుకున్నారు.

## వినోద్ మృతి బాధాకరం

**నెల్లూరు, నవంబర్ 5, ప్రభాతవార్త-వైద్యం :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పలు హాస్పిటల్స్‌లో ఎంఎన్ఓగా మంచిగా సేవలందిస్తూ ప్రస్తుతం సూళ్లూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో నిన్న రాత్రి వినోద్ మృతి చెందడం బాధాకరమని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకరరావు తెలిపారు. మంగళవారం వినోద్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఏపీ హంస జిల్లాఅధ్యక్షుడు చేజర్ల సుధాకరరావు మాట్లాడుతూ ఏపీ హంస జిల్లా జాయింట్ సెక్రటరీగా, జిల్లా మేల్ నర్సింగ్ ఆర్డర్లీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మంచి ఉద్యోగ నాయకుడుగా వ్యవహరిస్తూ ఉద్యోగుల మన్ననలు పొందిన వినోద్ కుమార్ ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు రావాల్సినవి సకాలంలో అందేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ కమల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అంత్యక్రియల కార్యక్రమంలో పలు ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## అత్యంత భక్తిశ్రద్ధలతో నాగులచవితి



**జలదంకి, నవంబర్5, ప్రభాతవార్త:** నాగులచవితి పండుగను మంగళవారం జలదంకి మండలంలో భక్తు లు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల లో మహిళలు సాంప్రదాయబద్ధంగ పుట్టలకు పాలు పోసి పసుపు కుంకుమ దారాలతో అలంకరించి పూజ లుచేశారు. ఉదయంనుంచే మహిళాభక్తులు ఆలయాలకు పోటెత్తారు. కార్తీకమాసంలో వచ్చిన ఈపర్వదినం పల్లెల్లో ఆధ్యాత్మక శోభను సంతరించుకుంది. ఈసందర్బంగ ప్రసాదాలు పంచిపెట్టారు.

## భక్తి శ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



**కలువాయి నవంబర్ 5 ప్రభాతవార్త** నాగుల చవితి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నాగుల పుట్టల వద్ద, అదేవిధంగా పలు శివాలయాలలో భక్తులు ఉపవాసాలు ఉండి భక్తి శ్రద్ధలతో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకలువాయమ్మ దేవస్థానానికి అనుసందానమైన నాగ బండల వద్ద అదే విధంగా షిర్డి సాయిబాబా దేవస్థానంలో ఉండే నాగ పుట్ట వద్ద వీటితోపాటు బ్రాహ్మణపల్లి సమీపంలో ఉండే నాగ పుట్టల వద్ద మహిళలు స్నానాలు ఆచరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

## పౌష్టికాహార విలువలపై అవగాహన కల్పించాలి



కోవూరు, నవంబర్ 5 ప్రభాతవార్త : కోవూరు ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు కేంద్రానికి సరఫరా చేసే గుడ్లు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. మంగళవారం ఎన్ఎస్ఆర్ కాలనీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రంలో ఉన్న గుడ్లు, బాల సంజీవని కిట్ల యొక్క నాణ్యతను నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రానికి వచ్చిన ఈ కిట్లను సకాలంలో గర్భవతులకు, బాలింతలకు అందజేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ సందర్శనాలకు వెళ్లినప్పుడు వారికి పోషకాహారం యొక్క విలువలపై అవగాహన కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

## భారీస్థాయిలో అన్నదానం



**కోవూరు, నవంబర్5 ప్రభాతవార్త :** కోవూరు మండలం చిన్నపడుగుపాడు ప్రాంతంలోని నాగులపుట్ట వద్ద మంగళవారం నాగులచవితి పర్వ దినాన్ని పురస్కరించుకుని రామిరెడ్డి దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీస్థాయిలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని పడుగుపాడు సొసైటీ మాజీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయాకర్‌రెడ్డి గత సంవత్సరాలుగా నిర్విరామంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారని, ఇందుకు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఈ అన్నదాన కార్యక్రమానికి చుట్టుపక్కల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కావలి ఎమ్మెల్యే దగుమాటిని కలిసిన టూటౌన్ నూతన ఎస్ఐ



**కావలి, నవంబర్05 ప్రభాతవార్త :** కావలి రెండవపట్టణ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఖలీమ్ మంగళవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యే దగుమాటిని సత్కరించి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్టవేసేలా పనితీరు ఉండాలన్నారు. శాంతిభద్రతలను కాపాడాలన్నారు. ప్రభుత్వానికి, తనకు మంచిపేరు తేవాలని ఎమ్మెల్యే కోరారు.

## విక్రమసింహపురిలో జరిగిన జాబ్‌మేళాలో 31మంది ఎంపిక

**కావలి, నవంబర్05 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సిడాప్‌లు సంయుక్తంగా మంగళవారం కావలి విక్రమసింహపురి యూనివర్సిటి పి.జి సెంటర్‌లో జరిగిన జాబ్‌మేళాలో 31మంది ఉద్యోగాలకు సెలెక్ట్ అయినట్లు యూనివర్సిటి పి.జి సెంటర్ ప్రిన్సిపాల్ తెలిపారు. వివిధ కంపెనీలకు చెందినవారు నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో 68మంది హాజరయ్యారన్నారు. వారిలో 31మంది సెలెక్ట్ అయ్యారన్నారు. ఉద్యోగాలకు సెలెక్ట్ అయిన వారందరిని ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు.

## భక్తిశ్రద్ధలతో నాగులు చవితి



**పొదలకూరు, నవంబర్ 5, ప్రభాతవార్త :** నాగుల చవితి పండుగను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి మండలంలో నాగుల చవితి పండుగ సందడి కనిపించింది. పొదల కూరు పట్టణంలోని పలు గ్రామాల్లో గిరి జన ప్రాంతాల్లో కూడా గిరిజన వాసులు నాగుల చవితి పండుగను జరుపు కు న్నారు. ప్రతి ఏడాది దీపావళి తర్వాత ఐదవ రోజున వచ్చేది నాగుల చవితి. ఈ నాగుల చవితిని పండు గను భక్తులు, వారి బంధువులు, అందరూ పుట్ట దగ్గరికి వెళ్లి నాగేంద్రుడు కాపాడాలని పూజలు చేశారు. భక్తులు నాగుల చవితి సందర్భంగా పుట్ట దగ్గర దీపావళి తరహాలో బాణాసంచా కాల్చి సందడి చేశారు. అక్కడే తమ బంధువులతో భక్తులు భోజనాలు తయారు చేసుకుని ఆనందంగా ఉల్లాసంగా గడిపారు.

## జడ్పి ఆవరణంలో పారిశుద్ధ్య లోపం పట్టించుకోని సిబ్బంది



**నెల్లూరు అర్బన్, నవంబర్ 5, ప్రభాతవార్త :** నూతన జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ కార్యాలయం వెనకవైపు ఉన్న జిల్లా పంచాయితీ కార్యాలయం ఆనుకొని నాలుగు రోజుల నుంచి మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది .అధికారులు కార్యాలయ సిబ్బంది ప్రజలు నడిచే రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తున్న పట్టించుకునే సమయం ఎవరికీ లేదు. జిల్లా పరిషత్ కార్యాలయం వెనుకవైపు మురికి నీరు అత్యంత దారుణంగా తయారైంది. టాయిలెట్స్ పైపు పగిలిపోవడంతో జిల్లా పరిషత్ కార్యాలయంలో వాడుతున్న టాయిలెట్స్ నీరు మొత్తం ఇటుగా ప్రవహిస్తుంది. అటువైపు వెళ్లాలంటేనే అత్యంత దారుణమైన పరిస్థితి నెలకొంది. వాసనతో అందరూ నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దీన్ని గ్రహించి తగిన శాశ్వత పరిష్కారం చూపుతారా లేదా మరిన్ని రోజులు వేచి చూడాలో చూద్దాం.

## భూవివాదాలకు తావులేదు..తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి

**విడవలూరు, నవంబర్ 5, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రిసర్వే ప్రాజెక్టు పేరుతో చేపట్టిన గ్రామసభలో వచ్చిన భూ సమస్యల పరిష్కారం కృషి చేస్తుందని ఇంచార్జి తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కారం చేసేందుకు గ్రామ సభలు ఉపయోగపడతాయన్నారు. తక్కువ విస్తరణ వచ్చిందని కొందరు రైతులు హద్దులు మారాయని అర్జీలు వచ్చినాయి. వీటిని వీలైనంతవరకు పరిష్కరిస్తాం క్రింద స్థాయిలో వీలు కాకపోతే పై స్థాయి అధికారులకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఎలాంటి సమస్య అయినా స్వచ్ఛందంగా సమస్యలు తెలపండి భూ వివాదాలకు తావు లేకుండా పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి, మండల సర్వేయర్ మస్తాన్ భాష, సర్పంచ్ అంగల వినోద్, టిడిపి నాయకులు సమాధి శ్రీనివాసులు, కొల్లు చిన్న వెంకయ్య, సురేష్, ఉప సర్పంచ్ కొమ్మిరెడ్డి మల్లారెడ్డి, వీఆర్వో నలబతు శ్రీనివాసులు, గ్రామ సర్వేయర్లు ఎన్. అశోక్, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలి



**కోవూరు, నవంబర్ 5 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్దిదారులు వాటిని మరింత వేగవంతం చేసి సకాలంలో నిర్మాణాలు పూర్తయ్యేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తగు చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరి రెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఏ ఉద్దేశంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను నియమించిందో ఆ ఉద్దేశాన్ని వారు పూర్తిగా మరిచిపోయారని, ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ వారికి ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, లేనిపక్షంలో వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం చేపడుతున్న లబ్దిదారులకు సంబంధించిన గృహాలు డిసెంబర్ నాటికి స్లాబ్ పూర్తి కావాలన్నారు. అదేవిధంగా మార్చి నాటికి నూరుశాతం నిర్మాణాలు పూర్తయ్యేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం చేపడుతున్న ఇంటి నిర్మాణానికి 1.80 లక్షల నిధులు మాత్రమే వస్తాయని ఈ విషయాన్ని లబ్దిదారులకు అవగాహన కల్పించేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తగు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## వవ్వేరులో బహిరంగగా బెల్ట్‌షాపులు



**బుచ్చి నవంబర్ 5 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని వవ్వేరు గ్రామంలో బెల్ట్‌షాపులు బహిరంగానే నిర్వహిస్తున్నారు. ఒక్క పక్క ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బెల్ట్‌షాపులు నిర్వహిస్తే 5 లక్షల జరిమానా అని చెబుతున్నా లెక్క చేయకుండా మద్యం యజమానులు విచ్చలవిడిగా మద్యంషాపులు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల వవ్వేరు బెల్ట్‌షాపులో పెద్దఎత్తున మద్యం పట్టుకొని వదిలి వేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మండలంలో మరికొన్ని గ్రామాలలో కూడా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ ఉన్నతా ధికారులు స్పందించి మండలంలో బెల్ట్‌షాపులపైన దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రేబాలలో రెవిన్యూ గ్రామసభ



**బుచ్చి నవంబర్ 3 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల గ్రామంలో తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు ఆద్వర్యంలో రెవిన్యూ సమస్యలపై గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఏటూరు శివరామకృష్ణారెడ్డి, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, సర్పంచ్ లఘంతోటి బాగ్యలక్ష్మి పాల్గోన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు రెవిన్యూ సంబందించిన పలు విషయాలపై తహసిల్దారు అవగాహన కల్పించారు. రైతులు తమ సమస్యలపై తహసిల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రీసర్వేలో తప్పులను సరి చేసేందుకు ఈ గ్రామసభలు ఉపయోగపడుతాయని అన్నారు. రీసర్వేలో ప్రధానంగా ఐదు సమస్యలపై దృష్టి సారించినట్లు తెలిపారు. విస్తీర్ణంలో వ్యత్యాసం, పట్టాదారు పేరు నమోదు, జాయింట్ ఫీల్డ్ విభజన, కోరిలేషన్ సవరణ, జాయింట్ ఫీల్డ్ మ్యూటేషన్‌విభజన వంటి సమస్యలపై తప్పిదం జరిగి ఉంటే రైతులనుంచి అర్జీలు స్వీకరించి 45 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికి మండలంలో నాలుగు చోట్ల గ్రామసభలు నిర్వహించడం జరిగిందని అన్నారు. మిగిలిన గ్రామాలలో 14 వ తేదిలోపు గ్రామసభలు పూర్తి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇనస్పెక్టర్‌ఆప్ సర్వే రఘురామరాజు, టిడిపి నాయకులు లఘంతోటి మస్తానయ్య, రైతులు, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గోన్నారు.

## వ్యవసాయం సాగు చేసే రైతులు సూచనలు పాటించాలి



**కోవూరు, నవంబర్ 5 ప్రభాతవార్త :** ప్రస్తుతం ఈ సీజన్‌లో వ్యవసాయం సాగు చేసే రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి అన్నారు. కోవూరు మండలం గంగవరం, పడుగుపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీపీటీ 5204 రకం నార్లు పోసుకోవడానికి నవంబర్ 10వ తేది ఆఖరుగా పెట్టుకోవాలన్నారు. ఆ పైన రోజులు పెరిగే కొద్దీ పైరు చివరి దశలో ఎండలు ఎక్కువగా ఉండి ధాన్యం విరుగుడుకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా నవంబర్ 10 కన్నా ఆలస్యంగా పోసిన పైర్లకు అగ్గి తెగుళ్లకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా ఆర్ఎన్ఆర్ 15048 రకం నవంబర్ 15వ తేది పైన నార్లు పోసుకోవాలన్నారు. నారుపడిలో విత్తిన 10 రోజులకు నారు తీయుటకు 7 రోజుల ముందుగానే సెంటు నారుమడికి 160 గ్రాముల కార్గోఫిరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చాద్విక, మౌనిక, మత్స్యశాఖ వీఎఫ్ఏ కోటేశ్వరమ్మ, రైతులు ఉన్నారు.

## డ్రై డే ,ఫ్రైడే ను తప్పక పాటించాలి



**వరికుంటపాడు, నవంబర్ 5,ప్రభాతవార్త :** ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే ,ఫ్రైడే ను తప్పక పాటించి ,ప్రజలకు అవగాహన కల్పించాలనీ మలేరి యా సబ్ యూనిట్ అధికారి ఎస్ జి నౌషాద్ బాబు, మండల వైద్యాధికారిణి కరిష్మా లు అన్నారు. మంగళవారం స్థానిక ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు, ఎఎన్‌యంలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నౌషాద్ బాబు మాట్లాడుతూ డ్రై డే ఫ్రైడేలో భాగంగా ఇంటింటా తిరిగి అవగాహన కల్పించాలన్నారు. మలేరియా ,డెంగ్యూ ,చికెన్ గునియా వంటి వ్యాధులు రాకుండా ప్రజలు రాత్రి నిద్రించే సమయంలో శరీరమును పూర్తిగా కప్పి ఉండే లేత రంగు దుస్తులు ధరించుట వలన ,దోమతెరలను ఉపయోగంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో సిహెచ్‌వో రాజశేఖర్ రాజు, టిబీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పంటల భీమా ను నమోదు చేయించుకోవాలి



**వరికుంటపాడు, నవంబర్ 5, ప్రభాతవార్త :** రబీ సీజన్‌లో పంటలను సాగుచేస్తున్న ప్రతి రైతు పంటల భీమా ను డిసెంబర్ 15 తేది నాటి కల్లా నమోదు చేయించుకొవాలని మండల వ్యవసా యాధికారి వి.రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వరి కుంటపాడు, రామాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి ,పలు పంటలను పరిశీలించి రైతులకు తగిన సలహాలు ,సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రవికుమార్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగుచేస్తున్న శనగ, మినుము, పెసర. వేరుశనగ పంటలకు సంబందించి డిసెంబర్ 15 తేది లోపు, వరి పంటను సాగుచేసుకునే వారు డిసెంబర్ 31 వ తేది లోపు మీ సేవ కేంద్రం లేదా బ్యాంకుల నందు ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఒక హెక్టారు శనగ పంటకు 140 రూపాయలు, మినుము పంటకు 95 రూపాయలు, వేరుశనగ పంటకు 150 రూపాయలు, వరి పంటకు 420 రూపాయలు ప్రీమియం చెల్లించి ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన నమోదు చేసుకొవాలన్నారు. ప్రీమియం చెల్లించిన రైతులకు పంట సాగు సమయంలో ఏమైనా నష్టం వస్తే ఒక హెక్టార్ శనగకు రూ 70 వేలు, మినుముకు 47,500, పెసరకు 45 వేలు, వేరుశనగకు 75 వేలు, వరికి 1 లక్ష,5 వేల రూపాయలను భీమా క్రింద అందజేస్తారని తెలిపారు. కాబట్టి పంటలను సాగు చేసే రైతులు తప్పక భీమా ను నమోదు చేసుకొవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమములో గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, పశు సంవర్ధక సహాయకులు కిషోర్, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సహాయక సంఘాలు యస్‌హెచ్‌జి ప్రొఫైల్‌లో సమగ్ర సమాచారం ఉంచాలి




**కావలి, నవంబర్05 ప్రభాతవార్త :** స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం యస్‌హెచ్‌జి ప్రొఫైల్ యాప్‌లో పొందుపర్చాలని మెప్మా ప్రాజెక్ట్ డైరక్టర్ డి.రవీంద్ర ఆదేశించారు. కావలి మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం మెప్మా మహిళా సంఘాలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత కొద్ది సంవత్సరాలుగా మెప్మాలో ఉన్న మహిళాసంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో లేనందువలన మెప్మా మిషన్ డైరక్టర్ గుంటూరు ఆదేశాలమేరకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. మహిళాసంఘాల్లో జరుగుతున్న పొదుపులు, అప్పుల వివరాలతోపాటు యస్‌హెచ్‌జి సభ్యులకు సంబంధించిన ప్రాథమిక, సాంఘీక, ఆర్థిక వాస్తవిక సమాచారాన్ని పొందుపర్చడం జరుగుతుందన్నారు. మహిళాసంఘాల సభ్యులు పేదరికంనుండి బయటపడేందుకు ఆర్థిక ప్రణాళికను తయారుచేసేందుకు యస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే ప్రతి నెలా మహిళాసంఘాలు తయారుచేసిన ఉత్పత్తులను అమ్ముకొనుటకు, ఓయన్‌డిసి, అర్బన్ మార్కెట్ ద్వారా అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సమగ్ర సమాచారం నింపుటకు రిసోర్స్‌పర్సన్స్ అందరూ కృషిచేయాలన్నారు. కావలి మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కావలి మున్సిపాలిటి పరిధిలో ప్రతి సంఘం సభ్యురాలియొక్క సమగ్ర సమాచారాన్ని తయారుచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందరి అందే విధంగా ప్రతి రిసోర్స్‌పర్సన్ కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయిలో పనిచేస్తున్న టిఇ-ఐబి అంకయ్య, టిఇ-యస్‌యస్ కాంతయ్య, ఐటి అంకర్ పర్సన్ శంకర్, సియంయం భారతి, సిఓయస్ కిరణ్‌కుమార్, లక్ష్మి ప్రసన్న, శైలమ్మ, డిఇఓ, డిఆర్‌పి, యస్‌యల్‌యఫ్, ఆర్పీయస్‌లు పాల్గొన్నారు.

## పిల్లలకు పాలు ఇవ్వడం లేదు.... గుడ్లు పెట్టడం లేదు

### మీబిడ్డలకు అయితే ఇలాగే పెడతారా! వార్డన్‌పై డిడి ఆగ్రహం



**బుచ్చి నవంబర్ 5 ప్రభాతవార్త** పిల్లలకు పాలు ఇవ్వడంలేదు..... గుడ్లు సక్రమంగా ఇవ్వడంలేదు..... ఇడ్లిలో పచ్చిడి గొడ్డుకారం.... మీ బిడ్డలకు బోజనం ఇలానే పెడతారా అంటు సోషల్ వెల్ఫేర్ డిడి బి.శ్రీనివాసులు ఎస్‌సి హాస్టల్ వార్డన్ సునీల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపిడిఒ కార్యాలయం వెనుక వున్న ఎస్‌సి బాలుర హాస్టల్‌ని డిడి బి.శ్రీనివాసులు ఉదయం టిఫిన్ సమయంలో ఆఖస్మికంగా తనీఖి చేశారు. ఆ సమయంలో ఆయన స్వయంగా ఇడ్లి రుచి చూశారు . పచ్చిడి కారంగా ఉండడంతో తినలేక పోయారు. పిల్లల్ని హాస్టల్ పరిస్థితుతులపై ప్రశ్నించారు. పిల్లలందరు భయపడుతూనే హాస్టల్ పరిస్థితులపైన డిడికి వివరించారు.వారానికి మూడు రోజులు పాలు ఇస్తున్నారని.మూడు రోజులు మాత్రమే గుడ్డుపెడుతున్నారని చెప్పడంతో డిడి ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో మంచి నీళ్ళుకావాలంటే పంచాయితీ ట్యాప్ వస్తేనే లేదంటే లేదు. బాత్‌రూంలోకి వెళ్ళి చూసిన ఆయన ముక్కుమూసుకొని బయటకు వచ్చారు. వార్డన్ సునీల్‌పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డన్‌కి మెమో ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిడి మాట్లాడుతు ప్రభుత్వం పేద విద్యార్థులకోసం లక్షల రూపాయాలు వెచ్చించి వారికి పూర్తి స్థాయిలో మంచి బోజనం,మంచి చదువు అందించాలని కృషి చేస్తుంటే వార్డన్లు ఇలా నిర్లక్ష్యంగా చేయడం సరికాదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

## కావలిలో తలసేమియా ఆసుపత్రి ఏర్పాటు

### ప్రజలకు ఓ వరం



**కావలి, నవంబర్ 5 ప్రభాతవార్త** కావలి పట్టణంలో తలసేమియా ఆసుపత్రి ఏర్పాటుచేయడం ఈ ప్రాంత ప్రజలకు, తలసేమియా బాధిత బాలలకు ఒక వరమని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ తెలిపారు. రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్ర ఏర్పాటుకు విరాళాలు అందించిన దాతలను కావలి ఆర్డీఓ వంశీకృష్ణ ఘనంగా సత్కరించి అభినందించారు. మంగళవారం కావలి రెడ్‌క్రాస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెద్దనగరాల్లో మాత్రమే సాధ్యమయ్యే తలసేమియా వైద్య సేవలు కావలిలాంటి చిన్నపట్టణంలో దాతల సహాయంతో ఏర్పాటుచేయడం ఎంతైనా అభినందనీయమన్నారు. మరో పదిరోజుల్లో తలసేమియా డేకేర్ సెంటర్ ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. తలసేమియా ఆసుపత్రి నిర్వహణకు దాతలు ముందుకువచ్చి రెడ్‌క్రాస్‌కు సహకరించాలని ఆర్డీఓ కోరారు. రెడ్‌క్రాస్ రక్తకేంద్ర ఆధునీకరణ, తలసేమియా ఆసుపత్రి నిర్మాణంకొరకు విశేష కృషి చేసి భారీగా విరాళాలు సేకరించిన రెడ్‌క్రాస్ జిల్లా కార్యవర్గసభ్యుడు కావలి రెడ్‌క్రాస్ కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డిని ఆర్డీఓ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన సేవలు చెప్పుకోదగ్గవన్నారు. కలికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత బ్యాంక్ అధికారి, రెడ్‌క్రాస్ యోగాకేంద్రం కన్వీనర్ కె.హరినారపరెడ్డి ఒకలక్ష తొమ్మిదివేలరూపాయలు అందచేశారు. ప్రముఖ బిల్డర్ దేవరపల్లి మధుసూధన్‌రెడ్డి ఒకలక్ష నూటపదహారురూపాయల చెక్కును ఆర్డీఓ వంశీకృష్ణచేతికి అందచేశారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్, ఛైర్మన్ దాకారపు రవిప్రకాష్, రొటేరియన్ వెంకట సుబ్బయ్య, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్‌పై విస్తృత ప్రచారం



**నెల్లూరు, నవంబర్ 5, ప్రభాతవార్త-వైద్యం** నగరంలో సోలార్ సూర్య ఘర్ ముఫ్తి బిజిలీ యోజన పథకంపై ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు అశోక్ సునీల్ కిరణ్‌లు విస్తృత ప్రచారం చేపట్టారు. మంగళవారం నగరంలోని ఏకే నగర్ సబ్ డివిజన్, రామ్మూర్తి నగర్ సబ్ డివిజన్, రాజేంద్ర నగర్ సబ్ డివిజన్లో నెల్లూరు టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు వారి పరిధిలోని అసిస్టెంట్ ఇంజనీర్లు, స్టాఫ్‌ను కలుపుకొని సచివాలయాల్లో, స్కూల్స్ లలో సోలార్ వినియోగంపై విస్తృత ప్రచారం కలిగించారు. సోలార్ వినియోగించినందువల్ల కలిగే లాభాలు గురించి వారికి అవగాహన కల్పించడం జరిగింది. నగర నియోజకవర్గంలో ఉన్న అన్ని సచివాలయాల్లో స్కూల్స్ లలో ఈ అవగాహన సదస్సులు కొనసాగిస్తామని డిప్యూటీ ఇంజనీర్లు తెలపడం జరిగింది. 200 యూనిట్లు వాడే వారికి ఇది చాలా మంచి అవకాశం అని, ఈ పథకం ద్వారా సబ్సిడీ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు లక్ష్మీబాయి, విజయ్, సుధాకర్, దామోదర్, లక్ష్మీ నారాయణ, నుసురుల్లా, మునిశేఖర్, గోపాలకృష్ణ, రమణ, కృష్ణవేణి, విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన



**సైదాపురం, నవంబర్ 5, ప్రభాతవార్త** మండల పరిధిలోని లింగసముద్రం, ఊటుకూరు గ్రామ సచివాలయం పరిధిలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారిణి హైమావతి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖకు సంబంధించి అనుబంధ శాఖలతో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా లింగసముద్రం, ఊటుకూరు గ్రామంలో రైతులు వేసిన పంటలను ఆమె పరిశీలించి ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ఆమె రైతులకు వివరించారు. రబీ సీజన్ మొదలు కావడంతో రైతులు వరి పంటలు వేసేందుకు సిద్ధం కావాలని ఆమె సూచించారు. జడ్పీటీసీ సభ్యులు చిత్తలూరి పోలయ్య, వ్యవసాయ సహాయకులురాజశేఖర్,రాకుమారి,నాయకులు,రైతులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో నాగులచవితి



**సైదాపురం, నవంబర్ 5, ప్రభాతవార్త** సైదాపురం మండలంలో నాగులచవితి సందర్భంగా మహిళలు వివిధ గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో నాగుల పుట్టలకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే తడి బట్టలతో పుట్టల వద్దకు వెళ్లి ముగ్గులు వేసి, పుట్టకు దారాలు చుట్టి నాగులచవితికి నువ్వులు పిండి, మొలకల సజ్జలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కార్తీక దీపోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే



**నెల్లూరు రూరల్, నవంబర్ 5, ప్రభాతవార్త** నెల్లూరులోని గణేష్ ఘాట్ వద్ద 15న నిర్వహించే కార్తీక మహా దీపోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మితో కలిసి ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద ఉన్న గణేష్ ఘాట్‌ను కోటంరెడ్డి సందర్శించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 15న అక్కడ నిర్వహించే కార్తీక మహా దీపోత్సవం, 108 తెప్పలతో శివాకృతి కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షించారు. సింహపురి కార్తీక దీపోత్సవ సమితి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కాశీ ఘాట్‌ను తలపించే విధంగా గణేష్ ఘాట్‌లో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 15 తేదీ సాయంత్రం వేలాది మంది మహిళలు కార్తీక దీపాలను చేతపట్టుకొని శోభయాత్ర నిర్వహిస్తారన్నారు. తర్వాత గణేష్ ఘాట్ వద్ద గంగా హారతి ఉంటుందని, అదే క్రమంలో 108 తెప్పలతో నెల్లూరు చెరువులో శివాకృతి కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా వాసులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డికి ఘన సన్మానం



**విడవలూరు, నవంబర్ 5, ప్రభాతవార్త** మండల ఇన్చార్జి తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా చౌకచర్ల టిడిపి నాయకులు, గ్రామ సర్పంచ్ వినోద్ కుమార్, సురేష్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో కప్పి సత్కరించారు.పలు గ్రామ సమస్యలను తెలియపరచి తెలుసు కున్నారు.ఉప సర్పంచ్ కొమ్మిరెడ్డి, మల్లారెడ్డి, కొల్లు వెంకయ్య పలువురు పాల్గొన్నారు.

## వైసిపి జిల్లా అధ్యక్షుడు కాకానితో భేటీ అయిన పర్వత రెడ్డి



**నెల్లూరు రూరల్, నవంబర్ 5, ప్రభాతవార్త** వైసిపి జిల్లా అధ్యక్షుడు ముఖ్య మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు అని తెలిసిన వెంటనే వైఎస్ఆర్‌సిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇంచార్జి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కాకాని గోవర్ధన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. వారితో భేటీ అయ్యారు. జిల్లాలో నగరంలో జరుగుతున్న పలు అంశాలపై చర్చించుకున్నారు.

## రెండవ పట్టణ సిఐ, ఎస్ఐలను సత్కరించిన

## సంయుక్త సేవాసంస్థ



**కావలి, నవంబర్ 5 ప్రభాతవార్త** కావలి రెండవపట్టణ పోలీసుస్టేషన్‌లో ఇటీ వల బాధ్యతలు చేపట్టిన ఇన్స్‌పెక్టర్, ఎస్ఐలను కావలి సంయుక్తసేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వి.గిరిబాబు, ఎస్ ఐలు యన్.గోపీచంద్, షేక్.గౌస్‌బాషా, సియం ఎ.కలీం అహ్మద్‌లను సంయుక్త సేవా సంస్థ సభ్యులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ సంస్థ బాధ్యులు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బుర్ల రఘుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనదగ్గర స్టూడెంట్‌గా వి.గిరిబాబు చదువుకున్నాడన్నారు. ఆయన ఇన్స్‌పెక్టర్‌గా రెండవ పట్టణ పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సంయుక్త సేవాసంస్థ చేస్తున్న సేవాకార్యక్రమాలను సిఐకి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర, సభ్యులు మాజీ కౌన్సిలర్ గంధం ప్రసన్నాంజనేయులు, షేక్.ఖాదర్‌బాష, పివి.శివప్రసాద్‌రెడ్డి, నేలటూరి శివప్రసాద్‌రెడ్డి, యం.చంద్రశేఖర్, పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి



కోవూరు,నవంబర్ 5 ప్రభాతవార్త : కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నాగుల చవితి వేడుకలు సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు వేకువజామునే నాగుల పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఈ నాగుల చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వాహకులు చేపట్టారు. కోవూరు మండలం చిన్నపడుగుపాడు ప్రాంతంలో వెలసి ఉన్న నాగులపుట్ట వద్ద భారీస్థాయిలో పూలంగి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అదేవిధంగా స్థానిక పెళ్లకూరు కాలనీలోని నాగులపుట్ట వద్ద వేకువజామునే మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్ని ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు.

## నాగులచవితి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



**కావలి, నవంబర్5 ప్రభాతవార్త** నాగులచవితి పర్వదినం సందర్భంగా మంగళవారం భక్తులు నాగేంద్ర విగ్రహాలకు పాలాభిషేకాలు చేశారు. ఒక్కపొద్దులు ఉండి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కావలి పట్టణంలోని శ్రీదుర్గా భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి (కావలి శివాలయం), కావలి విష్ణాలయం, కోర్టుసెంటర్, ఉత్తరంపేట రామాలయం, ముసునూరు తదితర ప్రాంతాలలోని నాగేంద్ర విగ్రహాలకు భక్తులు పాలాభిషేకం చేశారు. పుట్టల్లో పాలుపోసి పూజలు చేశారు. నాగులచవితి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు.

## ఏసీల వ్యవహారం పై విచారణ నిర్వహించండి

### -కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి
### -కో ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ డిమాండ్



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 5,ప్రభాతవార్త:**నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ని రెవెన్యూ విభాగం ఇతర సెక్షన్ లలో ఏర్పాటు చేసిన ఏసీల విషయంలో గోల్మాల్,జరిగిందని ,షాప్‌కు సంబంధించిన ఇన్వాయిస్ బిల్లులే పెట్టుకుండా ఆడిట్ విభాగం పెద్ద అధికారి బిల్స్ అప్రోవల్ చేసారని ఇటీవల వెలుగులోకి వచ్చింది.దీని పై మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు సభ్యులు విచారణకు డిమాండ్ చేశారు.14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి,కో ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ దీని పై స్పందించారు.కార్పొరేషన్ లో ఏ,ఏ విభాగాల్లో ఏసీలు ఏర్పాటు చేశారు.ఎంతెంత కొనుగోలు చేశారు.వాటి కెపాసిటీ ఎంత అంటే ప్రశ్నలతో అధికారులను నిలదీశారు.ఏసీల గోల్ మాల్ పై సమగ్ర విచారణ నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.అందుకు కమిషనర్ సమాధానం ఇస్తూ విచారణ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

## మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజమన్నార్

**నెల్లూరు, నవంబర్ 5, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని దర్గామిట్టలో ఉన్న ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీఎన్ రాజమన్నార్‌ని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో మార్కాపురం మెడికల్ కళాశాల ఒకటి. అయితే అది ఇంకా ప్రారంబం కాపోవడంతో అక్కడకు నియమించిన ప్రిన్సిపాల్‌ను నెల్లూరుకు బదిలీ చేశారు. ఆయన అక్కడ బాధ్యతలు స్వీకరిస్తే ఇక్కడ ఎఫెసీ హోదాతో అదనపు బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందు రిలీవ్ కానున్నారు.

## తెలుగుదేశం సభ్యత్వం నమోదు

## చేయించిన పాలకీర్తి రవి



**నెల్లూరు రూరల్, నవంబర్ 5, ప్రభాతవార్త** నియోజకవర్గంలో 24వ డివిజన్ కనపర్తిపాడు గిరిజన కాలనీలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పాలకీర్తి రవి ఆధ్వర్యంలో తెలుగుదేశం సభ్యత్వ నమోదు చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సూచనలతో మంగళవారం గిరిజన కాలనీలో సభ్యత్వం నమోదు చేయించామని అన్నారు. ఈ సందర్భంగా పాలకీర్తి రవి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక ఒకవైపు సంక్షేమ మరోవైపు అభివృద్ధి రెండు విధాలుగా రాష్ట్రం ముందుకు వెళుతుందని ఆ భరోసాతోనే నెల్లూరు రూరల్‌లో పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేస్తున్నారని తెలిపారు. గిరిజన కుటుంబాలకు ఎంతో ఉపయోగం ఉంటుందని వారికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాల అండగా నిలుస్తుందని వివరించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించామన్నారు. నియోజకవర్గ మొత్తం అత్యధికంగా తెలుగుదేశం సభ్యత్వం నమోదు చేయించుకోవడం చాలా ఆనందంగా ఉందని పాలకీర్తి రవి అన్నారు. ఈ కార్యక్రమంలో చల్లంచర్ల శ్రీనివాసులు, టిడిపి నాయకులు హరికృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అనుపల్లిని పరామర్శ ఆదాల



**నెల్లూరు రూరల్, నవంబర్ 5, ప్రభాతవార్త** కోవూరు పట్టణానికి చెందిన అనుపల్లి అశోక్ రెడ్డి సతీమణి సులోచనమ్మ సోమవారం కాలం చేశారు. ఈ నేపథ్యంలో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డి మంగళవారం అనుపల్లి నివాసంకు వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆమె మరణానికి గల కారణాలను అనుపల్లి అశోక్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఆమె ఆకస్మిక మరణం సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనుపల్లిని పరామర్శించిన వారిలో నెల్లూరు విజయ డైరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జడ్పిటిసి మల్లు సుధాకర్ రెడ్డి, స్వర్ణ వెంకయ్య, శశికాంత్, బెల్లంకొండ వెంకయ్య, కార్య నవీన్ తదితరులు పరామర్శించారు.

## చీటింగ్ కేసులో ముగ్గురు వ్యక్తులు అరెస్టు



**సైదాపురం, నవంబర్ 5, ప్రభాతవార్త** మైనింగ్ చేసుకునేందుకు సబ్‌లీజు ఇస్తానని నగదు తీసుకుని మోసం చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులను సైదాపురం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్సై కాంతికుమార్ వివరాల మేరకు.. మండల పరిధిలోని కలిచేడు గ్రామ రెవెన్యూకు సంబంధించి అచ్చి రమణ య్యకు చెందిన సుమారు 59.8 ఎకరాల మైన్‌కు లీజు గడువు ముగియడంతో రెన్యువల్ చేసుకునేందుకు నెల్లూరుకు చెందిన దువ్వూరు శ్రీనివాసులురెడ్డికి సబ్ లీజు ఇస్తానని నమ్మించి ఆయన వద్ద నుంచి సుమారు రూ.2.50 కోట్లు నగదు తీసుకుని మైనింగ్ లీజు పొందిన తరువాత రమణయ్య మైన్ సబ్ లీజు ఇవ్వ నని అడ్డం తిరగడంతో దువ్వూరు శ్రీనివాసులురెడ్డి ఈ ఏడాది ఆగష్టు 28న అచ్చి రమణయ్య.. నరేష్, జనార్ధన్‌లు తనను చీట్ చేసి నగదు తీసుకున్నారని ఫిర్యాదు చేశాడు. దీంతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా నేరం రుజువు కావడంతో వీరి ముగ్గురిని అరెస్టు చేసి గూడూరు కోర్టులో హాజరు పరచడం జరిగిందని ఎస్సై కాంతి కుమార్ తెలిపారు.

## రాష్ట్రంలోనే రెండో స్థానంలో నియోజకవర్గం

### - ఆత్మకూరు నియోజకవర్గాన్ని తొలి స్థానంలో నిలుపుతా

### - రూ.10కోట్లతో సిమెంట్ రోడ్లు

**నెల్లూరు, నవంబర్ 5, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గాల్లో రెండో స్థానాన్ని ఆత్మకూరు నియోజకవర్గం దక్కించుకుందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదుపై మండల కన్వీనర్లు, నాయకులు, బూత్ ఏజెంట్లకు మంత్రి దిశా నిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కూడా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుపై పార్టీ నేతలు, కార్యకర్తలు అందరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. నెల్లూరు పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల్లో ఆత్మకూరు ప్రథమ స్థానంలో ఉందని ఆనం వెల్లడించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో ఆత్మకూరును మొదటి స్థానానికి చేరుకునేలా పార్టీ క్యాడర్ అంతా సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని చెప్పాడు. నియోజకవర్గంలో 1.20 లక్షల మందిని సభ్యులుగా చేర్చేందుకు లక్ష్యంగా నిర్ణయించాం, ప్రతి బూత్‌లో కూడా సుమారు 70 శాతం ఓటర్లను పార్టీ సభ్యులుగా నమోదు చేసి లక్ష్యాన్ని అధిగమించేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని మంత్రి ఆనం కోరారు. సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుంది. ఐదు లక్షల వరకు భీమా సౌకర్యం కల్పిస్తూ వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, కోఆపరేటీవ్ సొసైటీలకు నామినేటెడ్ పరిధిలో పదవులను భర్తీ చేస్తామని తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి భవిష్యత్తులో అన్ని పదవుల్లోనూ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి పంచాయతీలో కూడా రూ.10కోట్లతో సిమెంట్ రోడ్లు మంజూరు చేశాం, ఆలయాల మరమ్మత్తులకు రూ.5లక్షలు మంజూరు చేస్తున్నాం, మండలానికి 50 గోకులాలను మంజూరు చేయించాం, రోడ్డు మరమ్మత్తు పనులు మొదలు పెట్టామని మంత్రి చెప్పారు. ప్రతి నెల ఒకటో తేదీన క్రమం తప్పకుండా సామాజిక పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని తెలిపాడు. గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జాప్యం లేకుండా పరుగులు పెట్టిస్తున్నామని ఆనం అన్నారు. పార్టీ క్యాడర్ అంతా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూనే, పార్టీ బలోపేతం కోసం సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని రామనారాయణరెడ్డి సూచించారు.

## ఇది ప్రజా ప్రభుత్వం

### ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికిన బసిరెడ్డిపాలెం గ్రామస్తులు



గుడ్లూరు, నవంబర్ 5, ప్రభాతవార్త గుడ్లూరు మండలం బసిరెడ్డిపాలెం గ్రామంలో గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో, కందుకూరు నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా సోమవారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బసిరెడ్డిపాలెం గ్రామస్తుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖ్యంగా మహిళలు, యువత ఘన స్వాగతం పలికారు. ముందుగా స్థానిక దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబునాయుడుకి మాత్రమే సాధ్యమని ప్రజలు విశ్వసించి మహాకూటమికి భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించారని అన్నారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని వృద్దులు, వికలాంగులకు పెన్షన్ల పెంపుదల శాశ్వత వికలాంగులకు రూ.15000లు పెన్షన్లు, అన్నా క్యాంటీన్, నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ, దీపం పథకం ద్వారా మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించడం వంటి ఎన్నో పథకాలను అమలు చేశారని తెలిపారు. కందుకూరు నియోజకవర్గ ప్రజలు అతి తక్కువ కాలంలో తనపై ఎంతో నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించినందుకు కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో తనను గెలిపించుకున్న కార్యకర్తల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గం అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు ప్రాజెక్టు ద్వారా నీరు అందించి ఈ సీజన్లో రైతులు వరి పంటకు నీరు అందించి రైతులు సంతోషంగా ఉండేందుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసిన బసిరెడ్డిపాలెం తెలుగు దేశం పార్టీ నాయకులకు, ముఖ్యంగా మహిళలు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జునరెడ్డి, నరాల మాలకొండారెడ్డి, ఉమ్మనేని సుబ్బారావు, పువ్వాడి వేణుగోపాల్, చెన్నారెడ్డి మహేష్, గ్రామ తెలుగు యువత మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## జడ్పిలో జిల్లా పంచాయితీ

## అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ కార్యక్రమం




**నెల్లూరు అర్బన్, నవంబర్ 5, ప్రభాతవార్త :** జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 2025 - 26 ఆర్థిక సంవత్సరంనకు గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీ అనే అంశం పై రెండు రోజుల శిక్షణా జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా ప్రజా పరిషత్ సిఈవోతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఈ రోజు ప్రధానంగా 2025 - 26 ఆర్థిక సంవత్సరంనకు గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీ అను అంశంపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం జరుపుకోవడం జరుగుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను పరిగణలోనికి తీసుకుని మీరందరూ ప్రభుత్వ సూచనలు పాటించి, గ్రామ సభలు నిర్వహించి, గ్రామ, మండల, జిల్లా అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాల్సిందిగా కోరుచున్నానని అన్నారు. ఈ శిక్షణలో ఏయే అంశములను పరిగణనలోనికి తీసుకొని, వాటి ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి అనే అంశంపై పూర్తి అవగాహన చేసుకోవాలని కోరారు. మీరు రూపొందించి ప్రభుత్వానికి పంపే ఈ అభివృద్ధి ప్రణాళికలు రాబోవు ఆర్థిక సంవత్సరంలో ప్రజలకు మేలు చేసే విధంగా ఉండేలా, నిర్దేశించిన నిర్ణీత సమయంలో ప్రభుత్వానికి పంపే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను కోరారు. అలాగే గ్రామ, మండల పరిషత్ కార్యాలయాలలో పరిశుభ్రతను పాటించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా అధికారులను ఈ సందర్భంగా కోరుతున్నారన్నారు. జిల్లా స్థాయి లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, మండల స్థాయి మాస్టర్ ట్రైలర్లు, డిపిఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతి

**చేజర్ల నవంబర్ 5 ప్రభాతవార్త** మండలకేంద్రమైన చేజర్లలోని శివాలయం వద్ద మంగళవారం గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహాన్ని కనుగొన్నారు. మృతురాలి వయస్సు 35 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతదేహంపై నీలిరంగు చీర ఉంది. అనారోగ్యంతో మృతి చెందిందా లేక ఆత్మహత్యకు పాలుపడిందా లేక ఎవ్వరైనా హత్య చేసి తీసుకొచ్చి పడేశారా ? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చేజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.